

..అను నేను



పార్లమెంట్ భవనం

» నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న పాలమూరు ఎంపీలు
» డీకే అరుణ తొలిసారి..
» మల్లు రవి మూడోసారి పార్లమెంట్‌లోకి
» సవాళ్లు, హామీలు నెరవేర్చడం కోసం గళం వినిపించాల్సిందే..
» వాటికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం

మహబూబ్‌నగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీలు నేడు పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పార్లమెంట్ సమావేశాలు సోమవారమే ప్రారంభమైనప్పటికీ రాష్ట్రాల ఆర్డర్ ప్రకారం తెలంగాణకు చెందిన ఎంపీలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేసేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ నుంచి గెలిచిన డీకే అరుణ, నాగర్‌కర్నూల్ నుంచి గెలిచిన డాక్టర్ మల్లు రవి ఈసారి తమ గళం వినిపించనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ఈసారి ఎన్నడూ లేనంత హోరాహోరీగా సాగాయి. సీఎం సొంత నియోజకవర్గం ఈ జిల్లా పరిధిలోనే ఉండటం వల్ల ఆయన స్థైర్యాన్ని దెబ్బతీయాలని ప్రతిపక్షాలు ప్రయత్నించాయి. పాలమూరు సీటు నుంచి బీజేపీ గెలవడంతో ఆ ప్రయత్నం కొంత మేర ఫలించింది. అయితే ముఖ్యమంత్రి స్వగ్రామం ఉన్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌ను మాత్రం కాంగ్రెస్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో నాయకులు పోటాపోటీగా హామీల వర్షం కురిపించారు. ఎలాగైనా గెలవాలనే కాంక్షతో అసెంబ్లీ ఎన్నికల్లో కంటే ఎక్కువగానే వాగ్దానాలు ఇచ్చారు. ఇప్పుడు ఆచరణ సమయం రానే వచ్చింది. ప్రజలు ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపడంతో వారు తమ గళం విప్పాల్సిన అవసరం ఏర్పడింది. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడంతో డీకే అరుణకు ఎక్కువ హామీలు నెరవేర్చుకోవడానికి వీలవుతుందని అందరూ అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఆమెకు కేంద్రమంత్రి పదవి ఇస్తారని అనుకున్నప్పటికీ.. సీనియారిటీ, సామాజిక కూర్పు నేపథ్యంలో మంత్రి కాలేకపోయారు. కానీ ఆమె అడిగిన అంశాలను మాత్రం కచ్చితంగా పరిగణలోకి తీసుకుంటారని అంచనాలు నెలకొన్నాయి. ఇక నాగర్‌కర్నూల్ నుంచి గెలిచిన మల్లు రవిపై కూడా ఎక్కువ బాధ్యతలే ఉన్నాయి. ప్రధానంగా జిల్లాల వారీగా కొత్త నవోదయ పాఠశాలలు, నారాయణపేట జిల్లాకు సైనిక్ స్కూల్, కేంద్రీయ విద్యాలయాలు, గద్వాల- డోర్నకల్, కృష్ణా- వికారాబాద్ రైల్వేలైన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ సెజ్‌లు, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా లేదా ప్రత్యేక నిధులు ఇండస్ట్రీ, టూరిజం, ఐటీ సంబంధిత పరిశ్రమల స్థాపన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంటుంది.

మూడోసారి మల్లు రవి..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి డాక్టర్ మల్లు రవి మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్న మల్లు రవి.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1991-1996 మధ్య ఈ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా పోటీచేసి 10వ లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత 1998లో మరోసారి ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. 2008లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. అప్పుడు జడ్చర్ల నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009లో అదే అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2014, 2019లలో నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీచేసి, పరాజయం పొందారు. తాజాగా 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందారు. సుదర్ఘీమైన రాజకీయ ప్రస్థానం ఉన్న మల్లు రవి.. పార్టీలో అనేక పదవులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఎంపీగా గెలవడంతో చాలా సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు భావిస్తున్నారు. ముఖ్యంగా గద్వాల- డోర్నకల్ రైల్వేలైన్, జాతీయ రహదారులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన, పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తికి కావాల్సిన నిధులు కేంద్రం నుంచి తేవడం సహా అనేక హామీలు ఉన్నాయి.




మల్లు రవి, డీకే అరుణ

తొలిసారి అరుణ..

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు 1952 నుంచి ఎన్నికలు జరుగుతుండగా ఒక్కసారి కూడా ఇక్కడి నుంచి మహిళ ఎంపీగా గెలవలేదు. ఒకసారి టీడీపీ నుంచి, రెండుసార్లు బీజేపీ నుంచి డీకే అరుణ ఈ స్థానం నుంచి పోటీ చేసి, మూడోసారి విజయం సాధించారు. అలా ఈ పార్లమెంట్ నుంచి మొదటి మహిళా ఎంపీగా డీకే అరుణ రికార్డులకు ఎక్కారు. అరుణ మొదట టీడీపీ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందగా.. తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 1999లో గద్వాల అసెంబ్లీ నుంచి పోటీ చేయగా, ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గట్టు భీముడు చేతిలో ఓటమిపాలయ్యారు. 2004లో కాంగ్రెస్ టికెట్ నిరాకరించడంతో సమాజ్‌వాది పార్టీ నుంచి పోటీ చేసి గట్టు భీముడిపై విజయం సాధించారు. తర్వాత కాంగ్రెస్‌లో కొనసాగారు. 2009, 2014లలో వరుసగా ఎమ్మెల్యేగా గెలిచి, రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలోనే ఆమెకు ఫైర్‌బ్రాండ్‌గా పేరు వచ్చింది. 2018లో అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో బీజేపీలో చేరి.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి చేతిలో పరాజయం పొందారు. 2023లో గద్వాల అసెంబ్లీ నుంచి పోటీచేసే అవకాశం ఉన్నప్పటికీ.. వద్దనుకుని, 2024లో మళ్లీ మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 4,500 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ మధ్యలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. పాలమూరుకు సంబంధించిన అనేక అంశాలపై ఆమె హామీలు ఇచ్చారు. ఎంపీగా మంగళవారం ప్రమాణ స్వీకారం చేస్తుండటంతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు భావిస్తున్నారు.

ఏం తినేటట్టు లేదు

» మండుతున్న కూరగాయల ధరలు » తగ్గిన సాగు విస్తీర్ణం
» ధరల నియంత్రణకు ముందుచూపు కరువు
» కూరగాయల రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి



ఖిల్లాఘణపురంలో వెలవెలబోతున్న కూరగాయల దుకాణాలు

ఖిల్లాఘణపురం, జూన్ 24: కూరగాయల ధరలు రోజు రోజుకు పెరిగిపోతుండడంతో సామాన్యులు ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు అనే విధంగా మారిపోయింది. ప్రతీ ఇంటి వంటలో నిత్యం వినియోగించే టమాటా పచ్చిమిర్చి, ధరలు ఆకాశాన్ని అంటడంతో ప్రజలు వంట చేసుకోవాలంటే భయపడిపోతున్నారు. ప్రస్తుతం టమాట, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, వంకాయ, బెండకాయ, క్యారెట్, బీన్స్, బీట్‌రూట్, క్యాప్సికం లాంటి కూరగాయలతో పాటు పాలకూర , కొత్తిమీర, పుదీనా లాంటి ఆకు కూరల ధరలు రెట్టింపు అయ్యాయి. వేసవికాలంలో స్థానికంగా కూరగాయల పంట సాగు ఉత్పత్తి తగ్గుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూరగాయల దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరుగుతున్నాయి. కూరగాయల కిలో ధర సుమారుగా రూ.100కు పైగానే ఉన్నాయి. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 2023-24 వానకాలం సీజన్‌లో కూరగాయలు పండించే రైతులు 1,344 మంది ఉండగా 1,719 ఎకరాల్లో, యాసంగి సీజన్‌లో బోరు బావుల కింద 533 మంది రైతులు 219 ఎకరాల్లో కూరగాయలు ఆకు కూరలు పంట సాగు చేస్తున్నారు. వేసవి కాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా కనీసం 10 ఎకరాల్లో కూడా కూరగాయల పంట సాగు కావడం లేదు. పంట దిగుబడి తగ్గిపోవడంతో కూరగాయల ధరలు పెరిగిపోయి వినియోగదారుడికి ఇబ్బందులు కలుగుతున్నాయి. కూరగాయల పంట సాగు చేసే రైతుల పరిస్థితి ఒక్కసారి లాభం వస్తే రెండుసార్లు తీవ్రంగా నష్టపోయి అప్పులపాలవుతున్నామని సేద్యం చేయడానికి ముందుకు రావడం లేదు. కూరగాయల ధరలను కొన్ని ప్రాంతాల వ్యాపారులు నిర్దేశించే స్థాయిలో వ్యవహరించడంతో చిన్న సన్నకారు రైతులు నష్టపోతున్నారు. టమాటాను ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి ప్రాంతంలోని వ్యాపారులు నిర్ణయిస్తుండగా.. ఉల్లిగడ్డను ఉత్తర భారతదేశం ప్రాంతంలోని వ్యాపారులు శాసిస్తున్నారు. వరి జొన్న , గోధుమ, వేరుశనగ, ధాన్యాలను నిల్వ చేసే విధంగానే కూరగాయలను కనీసం రెండు నెలలపాటు నిల్వ చేసే పద్ధతులు వస్తే కూరగాయల రైతులు ఆర్థిక అభివృద్ధి సాధిస్తారు. మార్కెట్లో కూడా ధరలు నియంత్రణలో ఉంటాయి.

పూట గడవడం కష్టంగా ఉంది



వంటింట్లో కూరగాయలు లేకపోతే పూట గడవడం కష్టంగా ఉంది. ప్రభుత్వం ధరల నియంత్రణ కోసం పక్కా ప్రణాళికతో ప్రత్యేక చర్యలు చేపట్టాలి. వినియోగదారులపై భారం పడకుండా కూరగాయల పంట దిగుబడులను పెంచాలి. కూరగాయలు పండించే రైతులకు రాయితీలు కల్పించి పంట సాగుపై అవగాహన కల్పించాలి.

- లావణ్య, గృహిణి, ఖిల్లాఘణపురం

గిట్టుబాటు ధర రావడం లేదు



కూరగాయల ధరలు పెరిగిపోవడంతో వ్యాపారులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. కూరగాయలను కిలో లెక్కన కొనేవారు గ్రాముల్లో కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుల అవసరాలు తీర్చడానికి తప్పని పరిస్థితుల్లో వేరే ప్రాంతం నుంచి తెచ్చి విక్రయిస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.

నాగమ్మ కూరగాయల వ్యాపారి, ఖిల్లాఘణపురం

కూరగాయల సాగుపై అవగాహన పెంచుతున్నాం



గ్రామాల్లో క్రమం తప్పకుండా కూరగాయల పంట సాగుపై రైతులకు అవగాహన పెంచుతున్నాం. కూరగాయల పంట సాగు చేసే రైతులు చిన్న సన్నకారు రైతులు మాత్రమే కావడంతో ప్రభుత్వం రాయితీలు అందిస్తే పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అంటుకట్టిన మొక్కల ద్వారా ఎక్కువ కాలం పంట వస్తుంది. డ్రిప్ సిస్టంతో కూరగాయలు సాగు చేసి పందిళ్లు వేసుకుంటే పంట దిగుబడి పెరుగుతుంది.

- సురేష్, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, వనపర్తి

పారదర్శకంగా బదిలీలు

» ఉపాధ్యాయుల స్వాప్ ఆప్షన్‌ను పకడ్బందీగా పరిశీలించాం
» ఆర్‌జేడీ విజయలక్ష్మి



బదిలీలపై డీఈవోతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

మహబూబ్‌నగర్ విద్యా విభాగం, జూన్ 24: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఆర్జేడీ విజయలక్ష్మి తెలిపారు. ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియను పరిశీలించేందుకు సోమవారం ఆమె మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలకు వచ్చారు. డీఈవో రవీందర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వాప్ విషయంలో ఎవరు తప్పు చేసినా చర్యలు తప్పవని ముందే హెచ్చరించినట్లు తెలిపారు. గతంలో జరిగిన జీహెచ్‌ఎంల బదిలీల్లో కొన్ని పొరపాట్లు చేశారని, ఆ పొరపాట్లు ఈ బదిలీల కౌన్సెలింగ్‌లో జరుగకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో ఆప్షన్ ఇచ్చిన తర్వాత మళ్లీ ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదన్నారు. కానీ ఇప్పుడు ఎడిట్ ఆప్షన్ ఇచ్చి, స్వాప్ పాయింట్లు పెట్టుకున్న వారిని పిలిపించి పూర్తిగా పరిశీలించినట్లు తెలిపారు. ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించి ఎలాంటి తప్పులూ జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎస్‌జీటీల బదిలీలు కూడా పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. భాష పండిట్, పీఈటీల అప్‌గ్రేడ్ జరిగిందని, వారికీ కౌన్సెలింగ్ చేస్తామని చెప్పారు.

డంపింగ్ యార్డ్‌కు గ్రహణం

» యార్డును ఆనుకొని చించోలి జాతీయ రహదారి వెళ్తుండటంతో మార్చాలనే ఆలోచన
» పాలమూరులో అనువైన స్థలం కోసం అన్వేషణ
» మార్చాలని స్థానికుల నుంచీ డిమాండ్
» మౌలాలి గుట్టలో స్థలం పరిశీలించినా అక్కడికి వెళ్లాలన్నా దూరం ఎక్కువే
» విస్తరిస్తున్న పట్టణానికి ఒకే డంపింగ్‌యార్డ్‌తో ఇబ్బందులు



యార్డ్‌లోంచి ఏర్పాటు చేస్తున్న రహదారి



కోయిలకొండ ఎక్స్ రోడ్ సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్

మహబూబ్‌నగర్, జూన్ 24: రాష్ట్రంలోనే పెద్దదైన పాలమూరు పురపాలికలోని కాలనీలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఎటు చూసినా 10 నుంచి 12 కిలో మీటర్ల మేర నగరం పెరిగింది. 49 వార్డులు, 55 వేల నివాసాలు, మూడు లక్షల జనాభా కలిగిన పురపాలికలో రోజూ 106 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇంతటి చెత్తను ఉన్న ఒకే ఒక్క డంపింగ్ యార్డ్‌కు తరలిస్తుండగా, చించోలి హైవే రూపంలో ఆ యార్డ్‌కు ఆటంకాలు ఎదురవుతున్నాయి. డంపింగ్ యార్డ్‌లోని కొంతభాగాన్ని కట్ చేస్తూ, రహదారి వెళ్తుండటంతో యార్డ్‌ను అక్కడి నుంచి మరోచోటుకు మార్చాలన్న ప్రతిపాదన రావడం చర్చనీయాంశంగా మారింది. నగరం విస్తరిస్తుండటంతో ప్ర స్తుతం ఉన్న ఈ యార్డ్‌కు అన్ని వార్డుల నుంచి చెత్తను తెచ్చేందుకు ఖర్చు పెరుగుతోందని, మరోచోట రెండో యార్డ్‌ను ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో ఉన్న యార్డ్‌ను మార్చాల్సిన పరిస్థితి నెలకొంది. దాంతో అనువైన స్థలం కోసం అన్వేషణ చేసే పనిలో యంత్రాంగం పడింది.

20 ఏళ్ల క్రితం

20 ఏళ్ల క్రితం కోయిలకొండ ఎక్స్ రోడ్ సమీపంలోని గుట్టపై డంపింగ్ యార్డ్ కోసం 25 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అక్కడ అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నారు. వర్మి కంపోస్ట్, డీఆర్ఎస్ కేంద్రం, సెగ్రిగేషన్ యంత్రాలను ఏర్పాటుచేసుకున్నారు. ప్రస్తుతం పట్టణం పెరగడంతో యార్డ్‌కు దగ్గరగా కాలనీలు విస్తరించాయి. చెత్త కుప్పల నుంచి వెలువడుతున్న పొగ, దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని చుట్టూ ఉన్న కాలనీల ప్రజలు వాపోతున్నారు. యార్డ్‌ను ఇక్కడి నుంచి మరో చోటుకు తరలించాలనే డిమాండ్‌లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు చించోలి హైవే యార్డ్‌లోంచి వెళ్లడం, డీఆర్ఎస్ భవనం కూలగొట్టాల్సి వస్తుండటంతో ఇక యార్డ్‌నే ఇక్కడినుంచి తరలించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఇక్కడ హైవే ఏర్పాటు చేశాక డంపింగ్ యార్డ్‌లో చెత్తను కాల్చడం వల్ల వచ్చే పొగ రహదారిపై వెళ్లే వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతుందని, దీనివల్ల ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. దాంతో యార్డ్‌ను ఇక్కడి నుంచి మార్చడమే మేలన్న అభిప్రాయాలు వస్తుండటంతో అధికారులు స్థలం కోసం అన్వేషిస్తున్నారు.

రెండు చోట్ల ఏర్పాటు చేస్తే ఖర్చు తగ్గే అవకాశం

ప్రస్తుతం పాలమూరు పురపాలికలో చెత్తను తరలించేందుకు 15 ట్రాక్టర్లు, 55 ఆటోలు వినియోగిస్తున్నారు. రోజూ రోజు రెండు ట్రిప్పుల చెత్తను అవి తీసుకెళ్తున్నాయి. అయితే ఆటోలలో 50 స్వచ్ఛ ఆటోలు కాగా, మిగిలిన ఐదు ఆటోలు, 15 ట్రాక్టర్ల డీజిల్ ఖర్చు నెలకు రూ.ఐదు లక్షల వరకు వస్తోంది. దీంతోపాటు స్వీపింగ్ మిషన్‌కు రోజూ 40 లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నారు. నగరం విస్తరిస్తుండటంతో డంపింగ్ యార్డ్‌కు చెత్తను తీసుకెళ్లాలంటే పలు కాలనీల నుంచి 12-15 కిలో దూరం అవుతోంది. అందుకే పట్టణం నలువైపులా మూడు నుంచి నాలుగు చోట్ల స్థలాలను సేకరించి, ఆయా వార్డుల నుంచి దగ్గరగా ఉన్న యార్డ్‌లకు చెత్తను తరలించడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు సమయం కలిసి వస్తుంది. రెండు ట్రిప్పులు చెత్తను తరలించే సమయంలో మూడు ట్రిప్పులు తరలించేందుకు అవకాశం ఉంటుంది. మూడు నుంచి నాలుగు చోట్ల యార్డ్‌లను 10 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసినా బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మౌలాలి గుట్టలో 10 ఎకరాల స్థలం పరిశీలించారు. కానీ అక్కడ యార్డ్ ఏర్పాటు చేస్తే శివారు కాలనీల నుంచి చెత్తను తరలించాలంటే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అది ఒక చాయిస్‌గా పెట్టుకుని, మరో రెండు నుంచి మూడు ప్రాంతాలలో స్థలాలు సేకరించి యార్డ్‌లను ఏర్పాటు చేయాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. అయితే డంపింగ్ యార్డ్‌లకు స్థలాలు దొరకడం కూడా కష్టమేనని తెలుస్తోంది. ఎక్కడ ఏర్పాటు చేసినా జనావాసాలకు దూరంగా ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. మరో 20 నుంచి 30 ఏళ్ల వరకు జనాలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలన్న ఆలోచనలు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

» జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఘటన

గద్వాల క్రైం, జూన్ 24 : రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివగుప్తా(31) గద్వాల రైల్వే స్టేషన్‌లోని రెండో నెంబర్ క్యాంటీన్‌లో పని చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున క్యాంటీన్ నుంచి కొత్త హౌసింగ్ బోర్డ్ కాలనీలోని యజమాని ఇంటికి వెళ్తున్నాడు. రైల్వే స్టేషన్ చివరన, హౌసింగ్ బోర్డు పార్క్ పక్కన పట్టాలు దాటుతుండగా కర్నూల్ వైపు వెళ్తున్న రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. ఘటనపై కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

వీడిన జడ్చర్ల హత్య మిస్టరీ

» భార్యనే భర్తను చంపించింది
» సుపారీగా మూడు మేకలు ఇచ్చేలా ఒప్పందం
» కూతురితో చెడుగా ప్రవర్తించడం, ఆమె ప్రేమ వివాహం జరుగదన్న కారణం
» వెల్లడించిన జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి

జడ్చర్ల, జూన్ 24: జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో మేకల షెడ్ వద్ద నిద్రించిన మేకం చిన్నఆంజనేయులు(46) హత్య మిస్టరీ వీడింది. కూతురితో చెడుగా ప్రవర్తించడం, ప్రేమించిన వాడితో కూతురి వివాహం జరగదన్న కారణంతో అతని భార్యనే ఆంజనేయులును దారుణంగా హత్య చేయించింది. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులను జడ్చర్ల పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కేసు వివరాలను పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆదిరెడ్డి వెల్లడించారు. రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మేకం చిన్న ఆంజనేయులు, భాగ్యలక్ష్మిలకు 2006లో వివాహం జరిగింది. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె అంజలికి సోషల్‌మీడియాలో హైదరాబాద్‌కు చెందిన పాండుతో పరిచయం ఏర్పడింది. పాండుతో అంజలి తరచుగా మాట్లాడుతున్న విషయాన్ని తండ్రి గుర్తించాడు. ఆమెను మందలించి, కొట్టాడు. కుమార్తెకు మద్దతుగా భాగ్యలక్ష్మి భర్తను విభేదించింది. దాంతో భార్యా కూతురిని ఆంజనేయులు కొట్టడంతో పాటు కుమార్తె పట్ల చెడుగా ప్రవర్తించాడు. అది తట్టుకోలేక అదే కాలనీలో నివాసం ఉంటున్న మైసమ్మ వద్ద భర్తను చంపేందుకు భాగ్యలక్ష్మి పథకం పన్నింది. తన భర్తను హత్య చేస్తే మూడు మేకలు సుపారీగా ఇస్తానని ఒప్పందం కుదుర్చుకుంది. పథకంలో భాగంగా ఈ నెల 21న భర్తకు అధికంగా మద్యం తాపి, వారి మేకల షెడ్ వద్ద పడుకోబెట్టింది. తర్వాత ఆమె ఇంటికి వచ్చి పడుకుంది. తన భర్తను చంపాలని మైసమ్మను, ఆమెకు మద్దతుగా ఉన్న ముత్యాలమ్మను పురమాయించింది. మైసమ్మ తన ప్రియుడు నరసింహను మేకల షెడ్ వద్దకు తీసుకెళ్లింది. పడుకుని ఉన్న ఆంజనేయులు కాళ్లు, చేతులను మైసమ్మ, ముత్యాలమ్మ పట్టుకున్నారు. నరసింహ వెంట తెచ్చుకున్న టవల్‌తో ముక్కు, నోరు మూసి, చిన్న చాకుతో గొంతు కోసి హత్య చేశాడు. హత్య చేసిన విషయాన్ని భాగ్యలక్ష్మికి చెప్పి పారిపోయారు. సీడీఆర్(కాల్ డేటా రికార్డ్) ఆధారంగా పోలీసులు ఈ నెల 23న భాగ్యలక్ష్మిని పట్టుకుని విచారణ చేశారు. దాంతో ఆమె హత్య వివరాలను వెల్లడించింది. హత్య కోసం ఉపయోగించిన చాకు, రక్తంతో తడిచిన టవల్, నరసింహ ఉపయోగించిన బైక్, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భాగ్యలక్ష్మి, మైసమ్మ, ముత్యాలమ్మ, నరసింహలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

‘వజ్రాలు దొరుకుతున్నాయంటూ హల్‌చల్’

కోస్గి, జూన్ 24 : వజ్రాలు దొరుకుతున్నాయంటూ హల్‌చల్ చేయడంతో జనాలు ఎగబడ్డారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని దేవాదాయశాఖ భూమి సర్వే నెంబర్ 1737లో బీసీ కాలనీ సమీపంలోని భూమిలో వజ్రాలు దొరుకుతున్నాయంటూ కొందరు ఆకతాయిలు పుకార్లు సృష్టించడంతో ఒక్కసారిగా జనాలు వజ్రాల కోసం ఎగబడ్డారు. కానీ ఎవ్వరికీ ఏమీ లభించకపోవడంతో వెనుదిరిగారు. ఇలాంటి అసత్య ఆరోపనలు ఎవరు నమ్మవద్దని ఎస్ఐ నరేష్ తెలిపారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్ట్

» వివరాలు వెల్లడించిన డీఎస్పీ లింగయ్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎన్.లింగయ్య

నారాయణపేట టౌన్, జూన్ 24 : దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నారాయణపేట డీఎస్పీ లింగయ్య తెలిపారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వర్కూరు గ్రామంలో రెండు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన నిందితులను గుర్తించి పట్టుకోవడం జరిగిందన్నారు. వర్కూరు గ్రామానికి చెందిన బొజ్జమొల్ల సుజాత ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనం చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అలాగే మరో ఇంట్లో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వర్కూరు గ్రామానికి చెందిన ఊరుముందర నరేష్, కర్నూలు జిల్లాకు చెందిన అతని స్నేహితుడు బోయ వీరేంద్ర జల్సాలకు అలవాటు పడి వర్కూరు గ్రామానికి జూన్ 16న వచ్చారని తెలిపారు. అక్కడే రెండు రోజులు ఉండి రెక్కీ నిర్వహించి తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీ చేసి రూ.మూడు లక్షల నగదు, తులంన్నర వెండి, మొబైల్ ఫోన్ చోరీ చేసినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. తాజాగా పోలీసులు నల్లగట్టు మారెమ్మ గుడి దగ్గరలో ఇద్దరు అనుమానితులను పట్టుకొని విచారించగా చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని వీరి నుంచి చోరీ సొత్తును రికవరీ చేసి, నారాయణపేట కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చేధించిన మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ అబ్దుల్‌ఖాదర్, హెడ్‌కానిస్టేబుల్ గోపికృష్ణ, కానిస్టేబుల్ రవీందర్, సాయికుమార్, రాజశేఖర్‌ను డీఎస్పీ అభినందించారు.

‘బీసీలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి’

నారాయణపేట, జూన్ 24 : మండలంలోని కొటకొండ గ్రామంలో జరిగిన ఘర్షణలో బీసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీసీలు బస్టాండ్ దగ్గర రాస్తారోకో చేశారు. ఆందోళనలతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. రాస్తారోకోను ఉద్దేశించి బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీలపై అక్రమంగా బనాయించిన కేసులు ఎత్తివేసి సమన్యాయం చేయాలన్నారు. ఏక పక్షంగా వ్యవహరిస్తే ఆత్మహత్యలకు పాల్పడాల్సి వస్తోందని హెచ్చరించారు. పోలీసులు చేరుకొని క్షేత్ర స్థాయిలో విచారించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వెంకటేష్, రాజు, దస్తప్ప, నర్సింహులు, కాశీనాథ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పికెట్

కోటకొండ గ్రామంలో మూడవ రోజు సామవారం పోలీస్ పికెట్ కొనసాగింది. పోలీసుల పహారతో గ్రామంలో నిఘా ఉంచారు. మండలంలోని కోటకొండ గ్రామంలో జరిగిన ఘర్షణ సంఘటనలో సోమ వారం 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో జడ్జి ముందు హాజరుపరిచారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ

- నెరవేరని పేదల సొంతింటి కల
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఏడాది క్రితం లక్కీడిప్
- నేటికీ గృహ ప్రవేశం చేయని లబ్ధిదారులు
- మౌలిక వసతులు కల్పించకపోవడమే కారణం

గద్వాల, జూన్ 24 : ఇళ్లులేని నిరుపేదలు సొంతింటి కల సాకారం కోసం నిరీక్షిస్తున్నారు. అది ఎప్పుడు నెరవేరుతుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికలకు ముందు అధికారులు హడావిడిగా లబ్ధిదారులను ఎంపికచేశారు. కానీ అప్పటికి ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవడం, లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకపోవడంతో గృహ ప్రవేశం చేయలేకపోయారు. ఇప్పటికి ఏడాది గడిచి పోయింది. ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు కేటాయించలేదు. దీంతో వారు అద్దె ఇళ్లలోనే నివసిస్తూ సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాకు 2,600 ఇండ్లు మంజూరు:

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. 2016లో పథకానికి రూపకల్పన చేసింది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు 13 వందల ఇండ్ల చొప్పున 26 వందల ఇళ్లను 2018 ఎన్నికలకు ముందు మంజూరు చేసింది. అలంపూర్ నియోజకవర్గంలో 25 ఇళ్లు పునాదులకే పరిమితం కాగా, మిగిలిన ఇళ్ల నిర్మాణం ఇప్పటివరకూ చేపట్టలేదు. గద్వాల నియోజకవర్గంలోని దౌదర్‌పల్లి దర్గా వద్ద అప్పటికే పేదల ఇళ్ల పట్టాలకు సేకరించిన భూమి ఉండటంతో 1,275 ఇళ్ల నిర్మాణానికి పూనుకుంది. గద్వాల మండలం గోనుపాడు వద్ద ఉన్న అసైండ్ భూమిలో ఆ గ్రామ ప్రజల కోసం మరో 25 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించింది. దాదాపు నాలుగేళ్ల పాటు నిర్మాణ పనులు కొనసాగాయి. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో గత ఏడాది ఏప్రిల్‌లో పేదలకు కేటాయించేందుకు దరఖాస్తులను స్వీకరించి లక్కీడిప్ నిర్వహించారు.

771 మంది లబ్ధిదారుల ఎంపిక

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం 37 వార్డుల నుంచి 5,100 దరఖాస్తులు వచ్చాయి. 2023 ఏప్రిల్ 15న ఆయా వార్డులలో ప్రజల సమక్షంలో లక్కీడిప్ నిర్వహించి, 771 మందిని ఎంపిక చేశారు. ఏడాది గడిచినా నేటికీ ఇళ్ల కేటాయింపు, గృహ ప్రవేశాలు జరగలేదు. దీంతో డిప్పులో ఇళ్లు వచ్చిన లబ్ధిదారులు అద్దె ఇళ్లలోనే నివసిస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తమకు ఎప్పుడు అప్పగిస్తారోనని ఎదురు చూస్తున్నారు. గద్వాలలో ఇళ్ల అద్దెలు నాలుగు వేల నుంచి ఆరు వేల రూపాయల వరకు ఉన్నాయి. దీంతో లబ్ధిదారులపై ఏడాది పాటు రూ. 50 వేల నుంచి రూ. 70 వేల వరకు అద్దె భారాన్ని భరించాల్సి వచ్చింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇళ్ల కేటాయింపు పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

కోర్టుకు వెళ్లిన వారి కోసం 504 ఇళ్లు

దౌదర్‌పల్లి దర్గా వద్ద 1,275 ఇళ్లు నిర్మించారు. అందులో 771 ఇళ్లకు మాత్రమే డిప్పు ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే దౌదర్‌పల్లి దర్గా వద్ద పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో 300 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల నిర్మించారు. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు. వారిలో ఇళ్లులేని నిరుపేదలకు న్యాయం చేయాలని కోర్టు సూచించడంతో అధికారులు 504 ఇళ్లను రిజర్వుచేశారు. ఇళ్ల పట్టాల భూమి కోల్పోయిన వాళ్లు చాలా మంది ఉన్నప్పటికీ, కోర్టును ఆశ్రయించిన వారికి ఈ అవకాశం లభించింది. వారికి కూడా ఇప్పటి వరకు ఇళ్లు కేటాయించలేదు. దీనికి తోడు ఇక్కడ మౌలిక వసతులు కూడా కల్పించలేదు. సీసీరోడ్లు, డ్రైనేజీలను నిర్మించలేదు. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించినా, మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. ఇవి లేకపోవడంతో లబిదారులు గృహ ప్రవేశం చేసినా అక్కడ నివసించే పరిస్థితి లేదు. సౌకర్యాల కల్పనకు నిధులు లేకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. మూడేళ్ల క్రితం నిర్మాణం పూర్తయిన ఇండ్ల కిటికీలు, తలుపులు ధ్వంసం అయ్యాయి. అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించి గృహప్రవేశాలు చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

శిథిలావస్థలో గోనుపాడు ఇళ్లు

మండల పరిధిలోని గోనుపాడు గ్రామం వద్ద 25 ఇళ్లు నిర్మించారు. వాటిని ఆ గ్రామ ప్రజలకు మాత్రమే కేటాయించనున్నట్లు అప్పట్లో ప్రకటించారు. అసైండ్ భూమి ఇచ్చిన వారికి ఐదు ఇళ్లు రిజర్వు చేయగా, మిగిలిన ఇళ్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కానీ ఎంపికలో వివాదం ఏర్పడటం, ఫిర్యాదులు రావడంతో కేటాయించలేదు. దీంతో ఆ ఇళ్లు ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కిటికీలు, తలుపులు, పైపులైన్లు ధ్వంసం అయ్యాయి. ఇళ్ల మధ్య ముళ్ల పొదలు, కంపచెట్లు మొలిచాయి. నాణ్యత లేకపోవడంతో పాడుపడ్డ ఇళ్లుగా కనిపిస్తున్నాయి. కానీ ఇవి విడివిడి ఇళ్లు కావడం, అంతర్రాష్ట్ర రహదారి పక్కనే ఉండటంతో పోటీ ఎక్కువగా ఉంది.



దౌదర్‌పల్లి దర్గా వద్ద డబుల్ ఇళ్లు



గోనుపాడు వద్ద శిథిలావస్థకు చేరుకుంటున్న ఇళ్లు

అద్దెలు చెల్లించలేకపోతున్నాం



మాకు ఇల్లు లేదు. ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో ఉంటున్నాం. డబుల్ బెడ్రూమ్ ఇంటికి దరఖాస్తు చేసుకోగా, డిప్పులో ఇల్లు రావడంతో సంతోషమైంది. కానీ ఏడాది గడిచినా ఇల్లు కేటాయించలేదు. గృహ ప్రవేశం చేయించలేదు. వచ్చే ఆదాయంలో సగం అద్దె కట్టడానికే పోతుంది.

- సుజాత, లబ్ధిదారురాలు, గద్వాల

కలెక్టర్‌కు నివేదిస్తాం



డిప్పుతీసి ఏడాది అయ్యింది. ఈ విషయాన్ని అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ)దృష్టికి గతంలోనే తీసుకెళ్లాం. ఇప్పుడు ఆయన బదిలీ అయ్యారు. మళ్లీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నిర్ణయం తీసు కుంటాం.

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్, గద్వాల

భార్యాభర్తలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలి

- రూ.50 లక్షల పరిహారం, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలి
- ఆర్డీవో కార్యాలయం ముందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

కొల్లాపూర్, జూన్ 24 : కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో చెంచు మహిళపై జరిగిన పాశవిక దాడిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నట్లు సమత సైనిక్ దళ్ దక్షిణ భారత దేశ అధ్యక్షుడు శాండ్ రేజర్ల రాజేష్, భారత నాస్తికత్వ సమాజ అధ్యక్షుడు బైరి నరేష్, కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు బుర్ర అభినవ్, రాష్ట్ర మాల మహనాడు ప్రధాన కార్యదర్శులు సతి, బండి శ్రీను తెలిపారు. సోమవారం బాధితురాలి పక్షాన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ముందు చెంచులతో కలిసి నాలుగు గంటల పాటు ధర్నా నిర్వహించారు. దాడికి బాధ్యులైన బండి వెంకటేష్ యాదవ్, బండి శివుడు పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అన్ని నేరాలకు సంబంధించిన సెక్షన్‌లను పోలీసులు చేర్చలేదని, నిందితులను ఇంత వరకు అరెస్టు చేయలేదని, బాధితురాలికి పూర్తిస్థాయిలో సరైన వైద్యం కల్పించలేదన్నారు. అత్యాచారానికి, చిత్రహింసలకు గురైన బాధిత కుటుంబానికి అవసరమైన తిండిగింజలు, ఇతర సౌకర్యాలు ప్రభుత్వం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, బాధితురాలి భర్తకు కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బాధితురాలికి రూ.50 లక్షల పరిహారం, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకుంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో నాగరాజుకు వినతి పత్రం అందజేశారు.



కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ముందు చెంచులతో కలిసి ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భూమి డబ్బులు అడిగినందుకే దాడి చేశారు

చెంచు మహిళపై జరిపిన పాశవిక సంఘటనలో రోజురోజుకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాను అమ్మిన భూమి డబ్బులు అడిగినందుకే తనపై దాడి చేశారని బాధిత చెంచు మహిళ మీడియా ముందు వాపోయింది. తనకున్న రెండెకరాల భూమిలో ఒక ఎకరం బండి వెంకటేశ్వర్లుకు విక్రయించామని, రూ. రెండు లక్షలు మాత్రమే డబ్బులు ఇచ్చారని మిగతా రూ. రెండున్నర లక్షలు ఇవ్వాలని అడిగినందుకు బండి వెంకటేశ్వర్లు తన భర్తను దుర్భాషలాడడని బాకీ తేరిపోయిందని చెప్పడంతో కుటుంబంలో గొడవలు జరిగాయని దాంతో తాను తల్లిగారింటికి వెళ్లానన్నారు. దాంతో బండి వెంకటేశ్వర్లు బండి శివుడు, బండి శివ తనను నాలుగు రోజుల పాటు నిర్బంధించి కొట్టారని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ మీడియా ముందు వాపోయింది.

కల్వర్టును ఢీకొన్న కారు

అలంపూర్ చౌరస్తా, జూన్ 24 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గట్టు మండలం, గంగిమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన తుమ్మలబాయి నరసింహులు, భార్య జయమ్మ, తమ్ముడు రమేష్, మరొక వ్యక్తి బడెన్న సోమవారం కారులో అలంపూర్ క్షేత్రానికి వచ్చారు. దైవ దర్శనం తర్వాత తిరిగి వెళ్తుండగా పుల్లూరు శివారులో కారుకు అడ్డం వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్నది. ప్రమాదంలో ముగ్గురికీ స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా, డ్రైవర్‌కు గాయాలు

పాన్‌గల్, జూన్ 24 : అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి సమీపంలో చోటుచేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం బుసిరెడ్డిపల్లి సమీపంలోని బొల్లిగట్టు నుంచి మట్టి తరలించేందుకు చెరువు కట్టమీద నుంచి వెళ్తున్న సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఉపాధ్యాయులు లేక పాఠశాలకు తాళం

- నిరసన తెలిపిన గ్రామస్థులు

ధరూరు, జూన్ 24 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని ఓబులోనిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో సోమవారం గ్రామ స్థులు నిరసన తెలిపారు. విద్యార్థులను బయటకు పంపించి పాఠశాలకు తాళం వేశారు. ఓబులోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో 105 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యాశాఖ అధికారులు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు. వారిలో ఒకరు మాత్రమే విధులకు హజరవుతున్నారు. మరో ఉపాధ్యాయుడు రావడం లేదు. ఈ విషయంపై పలుమార్లు విద్యాశాఖ అధికారులను అడిగినా పట్టించుకోలేదని గ్రామస్థులు తెలిపారు. దీంతో సోమవారం ఉదయం గ్రామస్థులు పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయుడితో పాటు విద్యార్థులను బయటకు పంపించి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ విషయంపై ఎంఈవో సురేష్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరింది. పాఠశాలకు తాళం వేసిన సంగతి తమ దృష్టికి రాలేదని ఆయన తెలిపారు. ఒక ఉపాధ్యాయుడు మాత్రమే హాజరవుతున్న మాట వాస్తవమన్నారు. బదిలీల ప్రక్రియ పూర్తికాగానే మరో ఉపాధ్యాయుడిని నియమించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుడి గైర్హాజరుపై ఇటీవల డీఈవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



పాఠశాల గేటు బయట నిలబడిన విద్యార్థులు

గ్రామాల్లో జోరుగా సాగుబడి

- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- కరుణించని వరుణుడు
- స్ప్రింక్లర్ల సేద్యంతో రైతన్న అవస్థలు

భూత్పూర్, జూన్ 24 : ఈఏడాది ఖరీఫ్ సాగు జూన్ మొదటి వారంలోనే ప్రారంభమైంది. అయితే ఎన్నడూ లేనివిధంగా ఈసారి వానలు రోహిణికార్తెలో అదును కావడంతో మండలంలో చాలామంది రైతులు జొన్న, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను సాగు చేశారు. మొదట్లో చిరుజల్లులు కురిశాయి. అయితే గత రెండు వారాల నుంచి వరుణుడు మొఖం చాటేయడంతో రైతులు వేసుకున్న పంటలు కాస్తా వాడిపోయి కనిపిస్తున్నాయి. బోరుబావులు, చెరువులు ఉన్నవారు తుంపర్ల సేద్యంతో సాగు చేస్తూ అవస్థలు పడుతున్నారు. వరుణుడు ఎప్పుడు కరుణిస్తాడా.. అన్న ఆశతో రైతులు కళ్లు కాయలు కాచేలా వేచి చూస్తున్నారు. జొన్న, మొక్కజొన్న, పత్తి పంటల్లో కలుపు తీసే పనిలో రైతులు, రైతు కూలీలు బిజీగా ఉన్నారు. మండలంలో దాదాపుగా అన్ని గ్రామాల్లో రైతులు 80 శాతం పంటలను సాగు చేసుకున్నారు. వానదేవుడు మొఖం చాటేయడంతో మొలకెత్తిన పంటలు వాడిపోయి కనిపిస్తున్నాయి. చాలాచోట్ల రైతులు పత్తి చేనులో గుంటికతో కలుపు తీస్తుండగా, మొక్కజొన్న, జొన్న చేనుల్లో దంతెతో కలుపు తీసే కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. ఇక వరి నారుమడుల తయారీలో రైతులు క్షణం తీరిక లేకుండా ఉన్నారు. రెండు, మూడురోజుల్లో వర్షాలు కురిస్తే జొన్న, పత్తి, మొక్కజొన్న పంటలు చేతికి వస్తాయని, లేకపోతే చేన్లన్ని ఎండిపోతాయని రైతులు దిగాలు పడుతున్నారు. ఏదేమైనా వాన రాక కోసం గ్రామాల్లో రైతులు వెయ్యి కళ్లలో ఎదురు చూస్తున్నారు.



కొత్తమొల్గర దగ్గర ఓ రైతు స్ప్రింకర్లతో పత్తి చేనును తడుపుతున్న దృశ్యం



భూత్పూర్ దగ్గర వేరుశనగ చేనులో కలుపు తీస్తున్న కూలీలు

బాలానగర్ ఆర్ఐ వెంకట్‌రెడ్డి సస్పెన్షన్

బాలానగర్, జూన్ 24 : ఓ భూవివాదంలో మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల ఆర్ఐ వెంకట్‌రెడ్డిని కలెక్టర్ విజయేందిర బోయి సోమవారం సస్పెండ్ చేశారు. ఆదివారం సెలవు దినం ఉన్నా ఓ ప్రైవేట్ ఉద్యోగితో కలిసి విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ వెంకట్‌రెడ్డిని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కార్యాలయానికి చేరుకొని సెలవు ఉన్నా ఎందుకు విధులు నిర్వహిస్తున్నావని, ఓ ప్రైవేట్ ఉద్యోగితో పనులు ఎందుకు చేయిస్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఈ విషయమై అడిషనల్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇదిలా ఉండగా మండలంలోని హేమాజీపూర్ గ్రామానికి చెందిన ఓ భూవివాదంలో ఆర్ఐ ఒక వర్గానికి అనుకూలంగా పని చేసినట్లు అభియోగం ఉండటంతో జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకున్నట్లు ఈ మేరకు ఆర్ఐని సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ సంఘటన మండలంలో సంచలనంగా మారింది.

జూనియర్ డాక్టర్ల సమ్మె విజయవంతం



జనరల్ ఆసుపత్రి ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జూడాలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 24 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన జూనియర్ డాక్టర్ల సమ్మె విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచేసే జూనియర్ డాక్టర్లు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డా.సాయిరాం మాట్లాడుతూ వైద్య విద్యార్థుల ఉపకార వేతనాలు నాలుగు నెలలకొకసారి ఇస్తున్నారని, దీనివలన చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందువలన గ్రీన్ చానల్‌ను ఏర్పాటుచేసి ప్రతీనెల ఉపకార వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైద్య విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, దానివలన తెలంగాణ విద్యార్థులు నష్టపోతున్నారని, ఆ రిజర్వేషన్‌ను తొలగించాలన్నారు. దీంతో పాటు ఉస్మానియా ఆసుపత్రి భవనాలు శిథిలావస్థకు చేరాయని, కొత్త భవనాలు నిర్మించాలని, అదేవిధంగా కాకతీయ మెడికల్ కళాశాలలో రోడ్లు నిర్మించాలన్నారు. అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో వైద్య విద్యార్థుల కోసం వసతిగృహాలు నిర్మించాలని, మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ల సంఘం నాయకులు డా.తేజశ్రీ, డా.సహజ తదితరులున్నారు.

స్కూల్ అసిస్టెంట్ ఎల్ఎఫ్ఎల్ బదిలీల ఉత్తర్వులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 24 : స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ల బదిలీల ఉత్తర్వులు సోమవారం రాత్రి డీఈవో రవీందర్ జారీ చేశారు. బదిలీ ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు వెంటనే కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ కావాలని సూచించారు. అయితే జిల్లా వ్యాప్తంగా మొత్తం 394 మంది ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీ ఉత్తర్వులు పూర్తి చేశారు. బదిలీ అయినా ఉపాధ్యాయులు కేటాయించిన పాఠశాలకు పోవాలని ఆయన సూచించారు. మంగళవారం నుంచి ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించి ఆప్షన్ ప్రక్రియ ఉంటుందని డీఈవో పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే బండ్ల

- క్షతగాత్రుడుని ప్రత్యేక వాహనంలో తరలింపు



గాయపడిన వ్యక్తిని ఎమ్మెల్యే కారులోకి ఎక్కిస్తున్న స్థానికుడు

ధరూరు, జూన్ 24 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఎమ్మెల్యే బండ్ల చంద్రశేఖర్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. మండల కేంద్రంలో సోమవారం కారు, బైక్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి గాయపడ్డారు. అదే దారిలో వెళ్తున్న ఎమ్మెల్యే బండ్ల చంద్రశేఖర్ రెడ్డి గమనించి, కారు దిగి సంఘటనా స్థలానికి వెళ్లారు. గాయపడిన వ్యక్తిని ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ విజయ్, వైఎస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సత్యం (ఫైల్)

మదనాపురం, జూన్ 24 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన గద్వాల సత్యం (24)ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తన స్నేహితులతో కలిసి మండలంలోని ఎర్రగట్టు దగ్గర ఉన్న మైసమ్మను చేశారు. అనంతరం అదే రాత్రి స్నేహితులు రాములు, శేఖర్‌తో కలిసి ఏదో పని ఉందని రామన్‌పాడు గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి రాములు, శేఖర్ తమ పొలాల దగ్గరకు వెళ్తున్నామని చెప్పి సత్యంను గ్రామానికి వెళ్లాలని సూచించారు. సత్యం తన బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా రామన్‌పాడు గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యం రాత్రి ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు అతని స్నేహితులను అడిగారు. రహదారి వెంబడి వెతకగా రోడ్డు పక్కన మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

అలంపూర్ చౌరస్తా, జూన్ 24 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండ ల పరిధిలోని కంచుపాడు గ్రామానికి చెందిన అన్నదమ్ముల మధ్య పొలం గెట్ల విషయంలో ఘర్షణ జరిగింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. అన్నదమ్ములు అంజనేయరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డిలకు ఉండవల్లి శివారులో త లా నాలుగు ఎకరాల పొలం ఉంది. ఇటీవల గెట్టు విషయంలో వారిద్దరి మధ్య వివాదం నెలకొన్నది. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరరెడ్డి గ్రామపెద్దలను తీసుకువ చ్చి పొలాన్ని చూపిస్తుండగా అన్నదమ్ముల మధ్య మాటామాట పెరిగి పరస్ప రం దాడులు చేసుకున్నారు. సంఘటనపై ఇరువురూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గట్టు, జూన్ 24 : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని మా చర్ల గ్రామ సమీపంలో టిప్పర్ ట్రాలీ విద్యుత్ తీగలకు తగిలడంతో ఆరు స్తంభాలు విరిగిపడ్డాయి. సంఘటన రాత్రి వేళ జనసంచారం లేని సమయంలో జరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి.. గట్టు ఎత్తిపోతల రిజర్వాయర్ కోసం మాచర్ల చెరువు నుంచి టిప్పర్‌లో నల్లమట్టిన తరలిస్తున్నారు. ఆ టిప్పర్‌లలో ఒకటి నల్లమట్టిని పారబోసి తిరిగి ట్రాలీని కిందకు దించకుండా చెరువు వైపు వెళ్తుండగా, పైన ఉన్న విద్యుత్ తీగలు దానికి తగిలాయి. టిప్పర్ అలాగే ముందుకు వెళ్లడంతో ఆరు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కొన్ని విద్యుత్ తీగలు పొలాల్లో పడగా, మరికొన్ని గట్టు నుంచి మాచర్లకు వెళ్లే రహదారిపై పడ్డాయి. రాత్రివేళ జనసంచారం లేని సమయంలో ఘటన జరగడంతో ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లి, జూన్ 24 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామానికి చెందిన కటి బాషా (50) గత శుక్రవారం 44వ జాతీయ రహదారిలో ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా, కారు ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్24: ధరణి పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో ధరణి, భూమి మార్కెట్ విలువలు, విద్యుత్ సబ్ స్టేషన్లకు భూ సేకరణ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భూ రికార్డుల పరిరక్షణ, ధరణి దరఖాస్తుల పరిష్కారంపై తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. పెండింగ్ మ్యూటేషన్, సక్సెషన్, కరెక్షన్ వంటి సమస్యలు ఏవిధంగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో రైస్ మిల్లర్లు తమ మిల్లు సామర్థ్యం మేరకు మిల్లింగ్ చేసి ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అందించడం లేదని, తహసీల్దార్లు తమ పరిధిలోని రైస్ మిల్లులపై ఒత్తిడి పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, ఆర్డీవో పద్మావతి, వనపర్తి సబ్ రిజిస్ట్రార్ రాజేష్, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈదమ్మ

ఖిల్లాఘణపురం, జూన్24: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్‌లు ఈదమ్మ, సుధ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022 నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం మండలంలోని 42 మంది అంగన్‌వాడీ టీచర్లు మూడు రోజుల పాటు శిక్షణ పొందుతారని తెలిపారు. 3నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్యను అందిస్తున్నట్లు గుర్తుచేశారు. నూతన జాతీయ విద్యావిధానంలో జరుగుతున్న మార్పులపై అంగన్‌వాడీ టీచర్లకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేపు పాఠశాలల బంద్

- ఏబీవీపీ పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్ తేజ

వనపర్తి రూరల్, జూన్24: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని ఏబీవీపీ పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్‌తేజ అన్నారు. సోమవారం పట్టణంలోని ఏబీవీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోజు రోజుకు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ పెరిగిపోతున్నందుకు నిరసనగా జూలై 26వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్ చేపడతామని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపైన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలని, నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు పాఠశాలల్లో బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతున్న యాజమాన్యాలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని వెంటనే డీఈవో, ఎంఈవోలను నియమించాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అర్జున్, నగర సంయుక్త కార్యదర్శి కార్తీక్, నిఖిల్, హరికృష్ణ, జగదీష్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి

వనపర్తి అర్బన్, జూన్24: పట్టణ సమీపంలోని తిరుమలయ్య గుట్ట ఎక్స్‌రోడ్డు వద్ద 58 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని బీజేపీ నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చురాం మాట్లాడుతూ... తిరుమలయ్య గుట ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా చేయడం వలన ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. తిరుమలయ్య గుట్ట ఎక్స్ రోడ్డు వద్ద విగ్రహ ఏర్పాటుకు ఐదు గుంటల భూమి, కళ్యాణ మండపం, తాగునీటి వసతి, పార్కు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని ట్రాఫిక్ సమస్యతో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వచ్చే ఆదాయం దుర్వినియోగంపై కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీతారాములు, రాజశేఖర్ గౌడ్ , నాయకురాలు సుమిత్రమ్మ, లక్ష్మీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పాన్‌గల్, జూన్ 24: గ్రామ అభివృద్ధిలో గ్రామస్థులు భాగస్వాములు కావాలని పంచాయతీ ప్రత్యేక అధికారి విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో పంచాయతీ కార్యదర్శి నర్మద అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్‌శెట్టి



కొత్తకోట, జూన్ 24 : మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన బీమ ప్రభాకర్‌శెట్టి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైనట్లు సోమవారం తెలిపారు. ఆదివారం జడ్చర్ల పట్టణంలో ఉమ్మడి జిల్లాల దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ప్రభాకర్‌శెట్టిని అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

మదనాపురం, జూన్ 24: మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ప్రారంభించి ఎనిమిది నెలలు కావస్తున్నా అక్కడ తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్, ఎంపీవోలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అలరించిన రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు

అమరచింత, జూన్ 24: ప్రత్యూష డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు ఆదివారం రాత్రి చైర్‌పర్సన్ మంగమ్మ ప్రారంభించారు. ఈ పోటీలు సోమవారం ఉదయం వరకు కొనసాగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని బేతంచర్లకు చెందిన డీజే మధు డ్యాన్స్ టీం మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో పాలమూరు జిల్లా బాలానగర్‌కు చెందిన రెడీడ్యాన్స్ టీం నిలిచింది. మొదటి బహుమతిగా రూ.25వేల నగదు షీల్డ్, ద్వితీయ బహుమతిగా రూ.15వేల నగదు షీల్డ్ బహుకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి : సీపీఎం

వీపనగండ్ల, జూన్ 24: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం బొల్లారం గ్రామంలో మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సూచించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.కృష్ణయ్య, మహబూబ్ బాషా, పార్టీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, మండల నాయకులు వి.కృష్ణయ్య, బాలగౌడ్, సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజలతో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 24: ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్‌తో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతీ సోమవారం ప్రజావాణికి తప్పకుండా హాజరు కావాలని, వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి సమాచారాన్ని ఫిర్యాదుదారుడికి పంపటడమే కాకుండా నివేదికను తనకు పంపించాలని ఆదేశించారు. వచ్చే వారం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని ఆదేశించారు. అందుకు అవసరమైన లాగిన్‌లు శిక్షణ కార్యక్రమం ఈ వారంలో పూర్తి కావాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 97 దరఖాస్తులు వచ్చినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని వినియోగంలోకి తీసుకురావాలి

పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామంలో లక్ష్మీదేవి ఫౌండేషన్ ద్వారా ఎన్ఆర్ఐ సురేఖ నిర్మించిన 10 పడకల ఆసుపత్రిని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఆరు నెలల క్రితమే ఆసుపత్రి నిర్మాణం పూర్తయిందని తెలిపారు. త్వరగా సిబ్బందిని నియమించి ఆ ప్రాంత ప్రజలకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్‌వోసీ కాపీ అందజేయాలి

వనపర్తి మండలంలోని బోనమ్మ తండా, బిక్య తండా, మర్రికుంట, నాగవరం గ్రామాల ప్రజలు గత ప్రభుత్వం తమకు అందజేసిన భూమికి సంబంధించి ఎన్‌వోసీ కాపీ అందజేయాలని ప్రజావాణిలో కలెక్టర్‌ను కోరారు. నాగవరం శివారులో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఐదు గుంటల చొప్పున స్థలం కేటాయించి పట్టాలు అందజేశారు. ఆ పట్టాలకు సంబంధించి ఎన్‌వోసీ సర్టిఫికెట్ కూడా ఇస్తామని అప్పటి మంత్రి నిరంజన్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే ఎన్‌వోసీ కాపీలు అందజేయాలని కోరారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వనపర్తి క్రైం : పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల పట్ల పోలీస్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ రక్షిత కె.మూర్తి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ... సంబంధిత పోలీస్ అధికారులు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని చట్టప్రకారం వారికి న్యాయం చేయాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పని చేస్తోందని, విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజావాణికి 15 ఫిర్యాదులు రాగా 10 భూతగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు, ఐదు భార్యభర్తల తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.



ఎన్‌వోసీ కాపీ ఇవ్వాలని వినతి పత్రంతో బోనమ్మ తండా, బిక్య తండా, మర్రికుంట, నాగవరం ప్రజలు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- అధికారుల సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జూన్ 24: నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను గుర్తించి త్వరిగతిన పూర్తి చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కొత్తకోట మండలంలోని బీమా ఫేజ్ - 2 పంప్‌హౌజ్‌లో ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, మునిసిపల్, రోడ్ల భవనాల శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనుల పూర్తికి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చూచుకోవాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులదే అన్నారు. అలాగే పంచాయతీ, మునిసిపల్, రోడ్లు భవనాల శాఖల పరిధిలోని నిర్మాణాలకు నిధుల ఇబ్బందులు ఉంటే అంచనాలు సిద్ధం చేసి ఇవ్వాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో అధికారులు నాగేశ్వర్‌రావు, కేశవరావు, నాగరాజు, నరేష్ కుమార్, చంద్రశేఖర్, నిసార్, నరసింహ్మా ఉన్నారు.

అనంతరం మిరాసిపల్లి గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేశారు. అనంతరం గ్రామ కూడలిలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి సభలో ప్రసంగించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్, జితేంద్రనాథ్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, భీంరెడ్డి, సురేందర్‌రెడ్డి, మాసన్న, శివరాజ్, ఉమామహేశ్వర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పట్టణానికి చెందిన విద్యార్థికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సోమవారం రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. బీమ ఆంజనేయులు రెండేళ్ల కిందట మృతి చెందగా కూతురు మాధురి సిద్ధి పేట లో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని చిన్నచింతకుంట మండల పర్థిపూర్ గ్రా మంలోని తన నివాసానికి పిలుచుకొని రూ. 50 వేల చెక్కును అందజేశారు.

ఎల్‌వోసీ అందజేత

మండలంలోని పామాపురం గ్రామానికి చెందిన పెద్ద రాములు అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య ఖర్చుల కోసం రూ.1.10లక్షలు మంజూరు చేయించారు. సోమవారం ఎమ్మెల్యే ఆస్పత్రికి చేరుకొని బాధితుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీని అందజేశారు.

హామీలను నెరవేరుస్తున్నాం

మదనాపురం : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే జీ మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన 83 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీవో సుజాత, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

- చెంచు మహిళను పరామర్శించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



చెంచు మహిళను పరామర్శిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, జూన్ 24: కొల్లాపూర్ మండలం ఓ గ్రామానికి చెందిన చెంచు మహిళను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి పరామర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి చేరుకొని చికిత్స పొందుతున్న బాధితురాలును, ఆమె భర్తను చిన్నారెడ్డి పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దాడికి గల కారణాలు తెలుసుకున్న ఆయన ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం తరఫున న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

త్వరలోనే వనపర్తికి ఎడ్యుకేషనల్ హబ్

- బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, డిగ్రీ కళాశాల భవనాలకు నిధులు మంజూరు

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్, జూన్ 24:ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే వనపర్తికి ఎడ్యుకేషన్ హబ్ రాబోతుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమందడి బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల శాశ్వత భవనాల నిర్మాణానికి రూ. 25 కోట్లు, రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల నూతన భవనానికి మరో రూ. 25 కోట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గంలోని గోపాల్‌పేట మండలం బుద్ధారం, పోలికేపాడ్ గ్రామ శివారులో 70 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. విద్యాపర్తిగా పేరున్న వనపర్తిని రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో నిలిపేందుకు ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు అద్దె భవనంలో కొనసాగుతున్న పెద్దమందడి బాలికల రెసిడెన్షియల్ పాఠశాల శాశ్వత భవన నిర్మాణానికి, అదేవిధంగా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి రూ. 50 కోట్లకు గాను ముందస్తుగా రూ. 25 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా అభివృద్ధికి మావంతు సహకారం అందిస్తాం

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్



కలెక్టర్ ఆదర్శ్ సురభిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వనపర్తి టౌన్, జూన్ 24: జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు పార్టీ తరఫున అధికారులకు మావంతు సంపూర్ణ సహకారం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి పూలమొక్క అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉండే ప్రతీ అధికారికి పూర్తి స్వేచ్ఛవాతవరణం కలిగించే ప్రజలు ఉన్న జిల్లాగా వనపర్తికి పేరుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయంలో జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉండేలా కలెక్టర్ కృషి చేయాలని, అందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున అవసరమైన సహకారం సంపూర్ణంగా అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, ఎండీ బాబా, నారాయణ, పెంటన్న, దివాకర్, రోహిత్, అక్షయ్, రాములు యాదవ్, మన్నెం, వెంకట రత్నం, రమేష్, బొడ్డుపల్లి నరసింహ, రవి, రాము పాల్గొన్నారు.

లబ్ధిదారుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం

- మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్



సిబ్బందికి సూచనలు చేస్తున్న మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్

వనపర్తి టౌన్, జూన్ 24: పట్టణ ప్రజల సౌకర్యం కోసమే మునిసిపల్ కార్యాయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని వనపర్తి మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో ఉచిత విద్యుత్ బిల్లు, రూ. 500లకే వంటగ్యాస్ సిలిండర్ దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. కౌంటర్‌లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేయడం కోసం ఉన్నామని అన్నారు. ఇటీవల ఎన్నికల కోడ్ కారణంగా ఉచిత విద్యుత్, రూ.500ల వంటగ్యాస్ పంపిణీకి కొంత ఆటంకాలు ఏర్పడ్డాయని, కోడ్ ముగియడంతో ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించే దిశగా మునిసిపల్ సిబ్బందిని పురమాయించామన్నారు. అందుకోసం మునిసిపల్ కార్యాలయంలో మూడు ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు.

ప్రభుత్వ పథకాలను పొందేందుకు అర్హులైన లబ్ధిదారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఏమైన ఇబ్బందులు కలిగితే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్ర మంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, లక్కాకుల సతీష్, కౌన్సిలర్ చీర్ల సత్యంసాగర్, రవియాదవ్, బొంబాయి మన్నెంకొండ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ భూముల ఆక్రమణపై సర్వే



దేవాదాయ భూముల సర్వే చేస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూన్ 24: ఆత్మకూరు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాదాయ భూమి , చెరువు శిఖం భూములలో ఆక్రమణపై సోమవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దేవాదాయ, శిఖం భూమి, పట్టణ కేంద్రంలోని 10 శాతం ల్యాండ్ ఆక్రమణకు గురయ్యాయని ఫిర్యాదులు వచ్చాయి. సర్వే నిర్వహించి నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో సర్వే నిర్వహించామని తెలిపారు. 430, 439, 441 సర్వే నంబర్లలో గల దేవాదాయ భూములలో 42 ఎకరాల 25 గుంటల భూమి ఉండేది. ప్రస్తుతం ఎకరం భూమికి పైగా కబ్జాకు గురైనట్లు గుర్తించామని తెలిపారు. అలాగే శిఖం భూమిలో 516 సర్వే నంబర్‌లో అక్రమంగా వ్యాపార సముదాయాలు వెలిసినట్లు గుర్తించామని తెలిపారు. అదే విధంగా వెంచర్లలో ప్రభుత్వానికి కేటాయించాల్సిన 10 శాతం భూమిలో అక్రమంగా అసెస్మెంట్ నంబర్ తీసుకుని క్రయవిక్రయాలు జరపడంతో నిర్మాణాలు కూడా వెలిశాయని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై మునిసిపల్‌లో ఇది వరకే నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నాగరాజులు, ఆర్ఐ జయమ్మ, ప్రభుత్వ సర్వేయర్ మన్యం, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి : ఎంపీడీవో

వనపర్తి రూరల్, జూన్ 24: ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఎంపీడీవో రాఘవ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం వనపర్తి మండలంలోని కిష్టగిరి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులు హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని అన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు పౌష్టికాహారం అందించి చదువుతో పాటు ఆటలు ఆడించాలన్నారు.

27 నుంచి సెమిస్టర్ 1 ప్రయోగ పరీక్షలు

వనపర్తి రూరల్, జూన్ 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న సైన్స్ విద్యార్థులకు సెమిస్టర్-1 ప్రయోగ పరీక్షలు 27 నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు వనపర్తి 99, గద్వాల 96, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ 196, నాగర్‌కర్నూల్ 179 మంది హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. వీరందరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వనపర్తిలో నిర్వహించే ప్రయోగ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకోసం అధ్యాయన కేంద్రాలలో సంప్రదించాలని సూచించారు.

కాలం చెల్లిన వాహనాలకు వేలం

వనపర్తి క్రైం, జూన్ 24: అగ్నిమాపక శాఖలో కాలం చెల్లిన వాహనాలతో పాటు పరికరాలకు ఈనెల 27న వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత సామాగ్రితో పాటు మోటార్ విడిభాగాలు వంటివి ఈ వేలంలో పెట్టనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 27న ఉదయం 11:30 గంటలకు జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం దగ్గరికి వచ్చి వేలంలో పాల్గొనాలని సూచించారు.

వ్యక్తిగత సమాచారాలు షేర్ చేయొద్దు

- ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీ అంజద్

వనపర్తి రూరల్, జూన్ 24: మీ వ్యక్తిగత సమాచారాలను షేర్ చేయొద్దు అని మానవ అక్రమ రవాణా నివేదిక విభాగముల ఇన్‌చార్జి ఎస్ఐ అంజద్ అన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలోని మహిళా జూనియర్ కళాశాలలో ఈవ్ టీజింగ్, మహిళలు, చిన్నారులపై జరుగు నేరాలు, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ, సైబర్ నేరాలు మొదలగు విషయాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.